# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...








సంపుటి : 3 | సంచిక : 22 | మంగళవారం 1 అక్టోబర్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# దసరా లోపు కొత్త ఉపాధ్యాయులు

- తమ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతను ఇస్తోంది
- గ్రూప్ వన్‌పై కీలక ప్రకటన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- దసరా లోపు 11 వేల మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందిస్తాం
- బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో 7,857 పోస్టులను మాత్రమే భర్తీ చేసింది
- కాంగ్రెస్ 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలను అందించిందని వెల్లడి
- తక్కువ సమయంలో డీఎస్సీ ఫలితాలు ఇచ్చామన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్

టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో డీఎస్సీ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. నిరుద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ... విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26ఆప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.మాజీ సీఎం కేసీఆర్ కేవలం 7, 857 టీచర్లను మాత్రమే నియమించారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల - మిగతా3లో




# హైడ్రా అంటే కూల్చివేతలే కాదు

- పేదల నివాసాల జోలికి వెళ్లదు..
- మూసీ నది సర్వేల వ్యవహారంపై హైడ్రా కీలక ప్రకటన
- మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదు
- అక్కడి నివాసితులను హైడ్రా తరలించడం లేదు
- మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు
- దీనిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోంది

హైదరాబాద్

మూసీ సుందరీకరణలో భాగంగా నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చివేయాలని సర్కారు నిర్ణయించడం, ఆ ఇళ్లకు మార్కింగ్ చేస్తుండటంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. మూసీ నదికి - మిగతా3లో



## 2047లో వికసిత్ భారత్‌ను ఖర్గే కళ్లారా చూడాలి

- కాంగ్రెస్ అధ్యక్షుడిపై అమిత్ షా నిప్పులు..
- 'కశ్మీర్‌లో ఖర్గే చేసిన వ్యాఖ్యలు విద్వేషంతో కూడుకున్నవి
- ఖర్గే హుందాతనంగా వ్యవహరిస్తారని భావించా. ఆయన ఇతర కాంగ్రెస్ నేతల మాదిరిగా మాట్లాడారు.
- ఆ పార్టీ నేతలకు మోదీ గురించి ఆలోచించడం తప్ప మరో ఆలోచన లేదు

# మతాన్ని, రాజకీయాలను కలపవద్దు

- కనీసం దేవుళ్లనైనా రాజకీయాలకు దూరం పెట్టండి
- తిరుమల లడ్డూ కల్తీపై పిటిషన్లు... సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- తిరుమల లడ్డూ తయారీలో జంతు నెయ్యిని వాడినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రమైన రీతిలో ఆధారాలు లేవు
- తిరుమల లడ్డూ వివాదంపై దాఖలైన పిటీషన్లపై ఇవాళ సుప్రీంకోర్టు విచారణ
- అలాంటి సందర్భంలో సీఎం చంద్రబాబు ఎలా పబ్లిక్‌గా ప్రకటన చేశారు
- తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలోనే ఇదంతా జరిగిందని ఆరోపణ
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైవీ సుబ్బారెడ్డి తదితరులు

-2లో






# మూసీ ప్రాజెక్ట్ పెద్ద స్కామ్

- కూల్చివేతలే ఇందిరమ్మ రాజ్యమా..?
- కాంగ్రెస్ సర్కారును నిలదీసిన కేటీఆర్
- మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం
- నామామీ గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం.
- జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది
- మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు నీకాడికేలి మొదలిపెట్టాలి కదా
- 'మంత్రులు వచ్చి మూసీ గొప్పదనం ఎందుకు చెప్పడం లేదు. మూసీ ఎంత జనరంజక ప్రాజెక్టు.. అద్భుతమైన ప్రాజెక్టో..

హైదరాబాద్

కూల్చివేతలే ఇందిరమ్మ రాజ్యమా? అంటూ కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల తారకరామారావు ధ్వజమెత్తారు. హైడ్రా కూల్చివేతలు, మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యం అన్నరు. - మిగతా3లో



## హర్యానా, జమ్మూకశ్మీర్‌లో అధికారం కాంగ్రెస్‌దే

- పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్
- "హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం
- రైతులకు అన్యాయం జరిగింది. రెజ్లర్లపై వివక్ష నడుస్తోంది
- హర్యానాలో కాంగ్రెస్ పార్టీ నినాదం ఇదే"
- జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ

# రుణమాఫీ కానివారికి గుడ్‌న్యూస్

- రేషన్ కార్డులేని రైతుల రుణమాఫీకి లైన్ క్లియర్
- గ్రామాల వారీగా రేషన్ కార్డులేని రైతు కుటుంబాల నిర్ధారణ పూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షలకుపైగా రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ రైతులున్నట్లు ప్రభుత్వం గుర్తింపు
- కేవలం రూ. 2 లక్షల లోపు ఉన్నవారికే రుణమాఫీ సాయం అందినట్లు సమాచారం



హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడిన అంశాల్లో రైతు రుణమాఫీ ప్రధానమైనది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతు రుణమాఫీ హామీని నెరవేర్చేందుకు కృషి చేశారు. మూడు విడతల్లో రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసింది. మొదటి విడతలో లక్ష, రెండో విడతలో లక్షన్నర, మూడో విడుతలో రెండు లక్షల మేర రుణమాఫీ చేసింది. అయితే కొన్ని కారణాల వల్ల కొంత మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లలో పేర్లు తప్పు కారణంగా కొందరు రైతులకు రుణమాఫీ కాలేదు. రేషన్ కార్డు ఉన్న వారికి రుణమాఫీ అవుతుందని రుణమాఫీలో ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల్లో ఉంది. దీంతో రేషన్ కార్డులు లేని కారణంగా మరికొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ క్రమంలో రుణమాఫీ కానీ రైతులకు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ కార్డులేని రైతుల రుణమాఫీకి లైన్ క్లియర్ అయ్యింది. దీనిపై క్షేత్ర స్థాయిలో లెక్కలను సర్కారు బయటకు తీసింది. గ్రామాల వారీగా రేషన్ కార్డులేని రైతు కుటుంబాల నిర్ధారణ - మిగతా3లో

# మతాన్ని, రాజకీయాలను కలపవద్దు

**న్యూఢిల్లీ:** కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. దాంతో వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి కూడా పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది.

మతాన్ని, రాజకీయాలను కలపవద్దు అని, కనీసం దేవుళ్లను రాజకీయాలకు దూరంగా పెట్టాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తిరుమల లడ్డూ వివాదంపై దాఖలైన పిటీషన్లపై ఇవాళ సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. లడ్డూలో జంతు కొవ్వు వాడినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని ఇవాళ సుప్రీం విచారించింది. జస్టిస్ బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లపై వాదనలు చేపట్టింది. తిరుమల లడ్డూ తయారీలో జంతు నెయ్యిని వాడినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రమైన రీతిలో ఆధారాలు లేవని కోర్టు చెప్పింది. అలాంటి సందర్భంలో సీఎం చంద్రబాబు ఎలా పబ్లిక్‌గా ప్రకటన చేశారని కోర్టు ప్రశ్నించింది. ఇది కోట్ల మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన వ్యవహారం అని, రెండో అభిప్రాయం తీసుకోకుండానే రాష్ట్ర ముఖ్యమంత్రి మీడియాతో ఎలా మాట్లాడారని ఆక్షేపించింది. కనీసం దేవుడ్ని అయినా రాజకీయాలకు దూరంగా ఉంచాలని సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారన్న దానికి ఆధారాలు ఏంటి? అని సూటిగా ప్రశ్నించింది.

వాదనల సందర్భంగా... ఎన్ని నెయ్యి టాంకర్లు వినియోగించారన్న వివరాలను టీటీడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. జూన్ నుంచి జులై వరకు ఎన్ని నెయ్యి ట్యాంకర్లు వాడారో వివరించారు. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీ చేసి, నెయ్యి సరఫరా చేస్తున్న ఏఆర్ ఫుడ్స్ కు చెందిన ట్యాంకర్లను పరీక్షకు పంపారని టీటీడీ తరఫు న్యాయవాది వెల్లడించారు. ఆ రిపోర్టు




ఆధారంగానే, లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్టు నిర్ధారణకు వచ్చారని తెలిపారు.

జస్టిస్ గవాయి మాట్లాడుతూ.. జంతు కొవ్వును వాడినట్లు వస్తున్న ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని కోర్టు సీఎం చంద్రబాబును ప్రశ్నించింది. నివేదికల ప్రకారమే నెయ్యి శ్యాంపిళ్లను తిరస్కరించినట్లు జస్టిస్ విశ్వనాథన్ చెప్పారు. ఇలాంటి సందర్భంలో ఎందుకు మీరు మీడియా ముందు మాట్లాడాల్సి వచ్చిందని కోర్టు అడిగింది. విచారణకు ఆదేశించిన మీరే, ఎందుకు మీడియా ముందు ఆరోపణలు చేశారని ఏపీ సీఎంను జడ్జీ ప్రశ్నించారు. అందుకే కనీసం దేవుళ్లను రాజకీయాలకు దూరంగా పెట్టాలని కోర్టు అభిప్రాయపడింది. కేవలం ఒక్క ల్యాబ్ లోనే కాకుండా... ఘజియాబాద్, మైసూర్ లలో ఉన్న ల్యాబ్ లలో నెయ్యి శాంపిల్స్ ను ఎందుకు పరీక్ష చేయించలేదు? దర్యాప్తు పూర్తి కాకుండానే కల్తీ జరిగిందని ఎలా చెబుతారు? అని ప్రశ్నించింది. అనంతరం తదుపరి విచారణను అక్టోబరు 3కి వాయిదా వేసింది.

తిరుమల లడ్డూలో చేప నూనె, బీఫ్, పంది కొవ్వు ఉన్నట్లు గుజరాత్‌కు చెందిన ఓ ల్యాబ్ తన రిపోర్టులో పేర్కొన్నది. దీంతో ఈ వివాదం తీవ్రతరమైంది. లడ్డూల తయారీ కోసం గత వైఎస్‌ఆర్సీపీ ప్రభుత్వం నాణ్యత లేని నెయ్యిని వాడినట్లు ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపనలు చేసిన విషయం తెలిసిందే.

# సీనియర్ సిటిజన్లకు శుభవార్త.. మీ కోసం కొత్త రూల్స్

**హైదరాబాద్:** భారతదేశంలో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. రోజుకు లక్షల మంది ప్రయాణం చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మహా నగరాలకు, పుణ్యక్షేత్రాలకు, పర్యాటక, ఇతర రాష్ట్రాల్లో నివసించే వారు స్వగ్రామాలకు రైళ్లలో వెళ్లేందుకు ఇష్టపడతారు. తక్కువ ఛార్జీతో ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. అయితే వారికి సీట్లు దొరకడం అనేది పెద్ద ఛాలెంజ్ అనే చెప్పాలి. పండగల సమయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఇక వృద్ధుల గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. దూరం ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చి లోయర్ బెర్త్ దొరకకపోతే వారికి నరకం కనిపిస్తుంది. అయితే వారి సమస్యను తీర్చేందుకు రైల్వే శాఖ ముందుకొచ్చింది.

**నయా రూల్స్..**

భారతీయ రైల్వే సీనియర్ సిటిజన్ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. లోయర్ బెర్త్‌ల రిజర్వేషన్ కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించింది. దీని వల్ల 60ఏళ్లు పైబడిన పురుషులు, 45 ఏళ్లు పైబడిన మహిళలు ప్రయాణించేందుకు మార్గం సుగమం చేసింది. ఇన్నాళ్లూ దిగువ బెర్త్ దొరకక వారి పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నయా రూల్స్ తెచ్చింది. సీనియర్ సిటిజన్ ఒంటరిగా లేదా మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ప్రయాణించే సమయంలో లోయర్ బెర్త్ పొందే అవకాశం కల్పించింది. అలాగే ఓ వృద్ధుడు మధ్య లేదా ఎగువ బెర్త్ పొంది దిగువ బెర్త్ అందుబాటులో ఉంటే టికెట్ కలెక్టర్‌ను సంప్రదించి బదిలీ చేసుకోవచ్చని తెలిపింది. అయితే ఇద్దరి కంటే ఎక్కువ మందితో కలిసి ప్రయాణించేటప్పుడు దిగువ బెర్త్ పొందేందుకు ఈ అవకాశం లేదు. అయితే అలా పొందేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..

**లోయర్ బెర్త్- ఇవి పాటిస్తే చాలు..**

సాధారణ సమయం సహా పండగల వేళ్లల్లో టికెట్ బుకింగ్ చేసేటప్పుడు సరైన నియమాలు పాటిస్తే వృద్ధులకు లోయర్ బెర్త్ పొందే అవకాశాలు ఉంటాయి. బుకింగ్ చేసే



సమయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దు. అలా చేస్తే సీనియర్ సిటిజన్లు సరైన సీటు పొందలేరు. బుకింగ్ చేసేటప్పుడు అన్ని విషయాలపై అప్రమత్తంగా ఉండటం అవసరం. టికెట్ బుక్ చేసే సమయంలో తప్పకుండా మీరు సీనియర్ సిటిజన్ కోటా ఎంచుకోవాల్సి ఉంటుంది. మీరు %×=జుజ% వెబ్‌సైట్ లేదా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల్లో రిజర్వేషన్ చేసే సమయంలో తప్పకుండా ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ కోటా కింద వృద్ధులకు లోయర్ బెర్త్‌లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొత్త నిబంధనల ప్రకారం వృద్ధులు ఒంటరిగా ప్రయణించకుండా లేదా ఇద్దరి కంటే ఎక్కువ మందితో ప్రయాణిస్తే లోయర్ బెర్త్ అవకాశం ఉండదు. అప్పుడు ఏ చేయాలంటే.. ఎక్కువ మందితో ప్రయాణించాల్సి వస్తే సీనియర్ సిటిజన్ టికెట్‌ను విడిగా బుక్ చేయడం మంచిది. దీని వల్ల వారు లోయర్ బెర్త్ పొందే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఇతరులతో ప్రయాణించేటప్పుడు విడిగా బుక్ చేసుకోవడం మర్చిపోవద్దు.

టికెట్ బుకింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోండి. ముఖ్యంగా వృద్ధుల వయస్సును పూరించేటప్పుడు తప్పుగా నమోదు చేయ్యొద్దు. వారి నిజమైన వయస్సును మాత్రమే తెలపండి. తద్వారా లోయర్ బెర్త్ దొరికే అవకాశాలు ఉంటాయి. తప్పుగా నమోదు చేస్తే మీరు అవకాశాన్ని చేజేతులారా వదులుకున్నట్లే. పండగల వేళ రైళ్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రిజర్వేషన్ తెరిచిన వెంటనే బుక్ చేసుకోవడం ఉత్తమం. తద్వారా అందరి కంటే ముందే సీట్లు దొరికే అవకాశం ఉంటుంది. లోయర్ బెర్త్ కాకపోయినా కనీసం కన్ఫర్మ్ చేసిన బెర్త్ పొందే అవకాశాలైనా ఉంటాయి. ఏసీ క్లాస్ కంటే స్లీపర్ క్లాస్‌లో ఎక్కువ బెర్త్‌లు ఉంటాయి. కాబట్టి స్లీపర్ క్లాసులో బుక్ చేసుకోవడం వల్ల సీటు పొందడం సులభం అవుతుంది. అందుకే వీలైనంత ఎక్కువ బెర్త్‌లు ఉన్న చోటే రిజర్వేషన్ చేసుకోండి.

## ఐసీయూలో పనిచేయని ఏసీలు.. ఇళ్ల నుంచి టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకుంటున్న రోగులు..!

మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ ఆసుపత్రి లో దయనీయ స్థితి నెలకొంది. అక్కడ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో గత కొన్ని నెలలుగా ఏసీలు పనిచేయడం లేదు. దీంతో ఉక్కపోతకు రోగులు అల్లాడిపోతున్నారు. జబల్‌పూర్‌లోని సేత్ గోవింద్ దాస్ విక్టోరియా జిల్లా ఆసుపత్రిలో ఈ దుస్థితి నెలకొంది. రోగులు క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నసమయంలో చికిత్స అందించే ఈ యూనిట్‌లో ఈ పరిస్థితి నెలకొనడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉక్కపోతకు అల్లాడుతున్న రోగులు తమ ఇళ్ల నుంచి టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకొని మంచాల చెంతన ఏర్పాటు చేసుకుంటున్నారు. స్థానిక మీడియా ప్రతినిధులు ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. బడ్జెట్ లేకపోవడమే ఇందుకు కారణమని వారు పేర్కొనడం గమనార్హం. నార్త్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభిలాష్ పాండే ఇటీవలే విక్టోరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలోని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. దోషులుగా తేలిన వారిని శిక్షిస్తామని రోగులకు హామీ ఇచ్చారు. మాండ్లా, దిండోరితో సహా ఇతర జిల్లాల్లోని ఆసుపత్రుల్లోనూ ఇలాంటి పరిస్థితులే కొనసాగుతు న్నాయని ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ మనీష్ మిశ్రా తెలిపారు.

### ‘యా.. యా..’ ఏంటి..?.. ఇది కాఫీ షాప్ కాదు..

# కోర్టు రూమ్.. న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం

సుప్రీంకోర్టులో ఇవాళ ఒక న్యాయవాది తీరు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు ఆగ్రహం తెప్పించింది. ఒక కేసు విచారణ సందర్భంగా సీజేఐ ఒక న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సదరు న్యాయవాది వాదనలు వినిపించే క్రమంలో పదేపదే ‘యా.. యా..’ అనడంపై సీజేఐ విస్మయం వ్యక్తం చేశారు. ‘యా..’ అనే పదం గౌరవప్రదమైన పదం కాదంటూ సీరియస్ అయ్యారు.



‘మీరు కాఫీ షాప్‌లో లేరు.. కోర్టు రూంలో ఉన్నారు.. పదాలను జాగ్రత్తగా వాడండి.. ‘యా..’ అనే పదం అంటే నాకు, మా న్యాయమూర్తుల బెంచ్‌కు అలర్జీ. అలాంటి పదాలు వాడేందుకు మిమ్మల్ని మేం అనుమతించం’ అంటూ సీజేఐ డీవై చంద్రచూడ్ లాయర్‌కు చీవాట్లు పెట్టారు. సదరు లాయర్ 2018లో సుప్రీంకోర్టులో దాఖలైన ఓ రివ్యూ పిటిషన్‌పై వాదనలు వినిపించడం మొదలుపెట్టారు.

ఆ పిటిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 32తో ముడిపడినది. భారత పౌరుల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగినప్పుడు, వారికి రాజ్యాంగ పరిహారపు హక్కును కల్పించడమే ఆర్టికల్ 32 ప్రత్యేకత. ఈ పిటిషన్‌లో ప్రతివాదిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను పేరును కూడా పిటిషనర్ చేర్చారు. దీనిపై సీజేఐ చంద్రచూడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి స్థాయి వ్యక్తి పేరును పిటిషన్‌లో ఎలా చేర్చారని ప్రశ్నించారు. వెంటనే ఆ పేరును పిటిషన్ నుంచి తొలగించాలని కోర్టు రిజిస్ట్రీని సీజేఐ ఈ క్రమంలో మరోసారి లాయర్ స్పందిస్తూ.. గతంలో ఇదే పిటిషన్‌ను నాటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ డిస్మిస్ చేశారని, తదుపరి సీజేఐ ఠాకూర్ ధర్మాసనం ఎదుట రివ్యూ పిటిషన్ వేశామని, దాన్ని కూడా డిస్మిస్ చేశారని, ఇప్పుడు వేసిన పిటిషన్‌లో అందుకే గొగోయ్‌ని కూడా ప్రతివాదిగా చేర్చామని చెప్పారు. దాంతో సీజేఐ ఈ పిటిషన్‌తో రంజన్ గొగోయ్‌కు సంబంధం లేదని, ఆయన పేరును తొలగించాలని ఆదేశించారు.

## 2047లో వికసిత్ భారత్‌ను ఖర్గే కళ్లారా చూడాలి



హైదరాబాద్: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ అగ్ర నేతల మధ్య డైలాగ్ వార్ తీవ్రస్థాయికి చేరింది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన కామెంట్స్ తీవ్ర కలకలం రేపాయి. నరేంద్ర మోదీని గద్దె దించేవరకు చనిపోనని ఖర్గే అన్నారు. ఆయన వ్యాఖ్యలను బీజేపీ నేతలు తప్పు పట్టారు. అమిత్ షా ఏమన్నారంటే.. ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ‘కశ్మీర్‌లో ఖర్గే చేసిన వ్యాఖ్యలు విద్వేషంతో కూడుకున్నవి. ఖర్గే హుందా తనంగా వ్యవహరిస్తారని భావించా. ఆయన ఇతర కాంగ్రెస్ నేతల మాదిరిగా మాట్లాడారు. మోదీపై కాంగ్రెస్ నాయకులకు ఉన్న ద్వేషం ఆ వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఆ పార్టీ నేతలకు మోదీ గురించి ఆలోచించడం తప్ప మరో ఆలోచన లేదు అని’ అమిత్ షా మండిపడ్డారు.

**కోలుకోవాలి..**

అనారోగ్యానికి గురయిన ఖర్గే కోలుకోవాలని నేను, మోదీ కోరుకున్నాం. ఆరోగ్యంతో ఉండాలని అందరం ప్రార్థిద్దాం. ఖర్గే మరికొన్ని ఏళ్లు జీవించాలి. 2047లో వికసిత్ భారత్‌ను ఖర్గే కళ్లారా చూడాలి అని అమిత్ షా పేర్కొన్నారు.

**చికిత్స పొంది..**

కశ్మీర్‌లో గల జస్ రోటాలో జరిగిన ర్యాలీలో ఖర్గే పాల్గొని ప్రసంగించారు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్దరించే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తన వయస్సు 83 ఏళ్లు అని.. అప్పుడే తాను చనిపోనని తెలిపారు. మోదీని ప్రధాని పదవి నుంచి దింపేవరకు రాజకీయాల్లో ఉంటానని స్పష్టం చేశారు. అస్వస్థతకు గురై.. చికిత్స తీసుకున్నారు. తర్వాత ఉద్వేకంగా మాట్లాడారు.

**ప్రధాని మోదీ ఫోన్**

మరోవైపు ఖర్గే అనారోగ్యానికి గురయ్యారని తెలిసి ప్రధాని మోదీ ఫోన్ చేసి ఆరోగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమిత్ షా కూడా ఖర్గే కోలుకోవాలని, ఆరోగ్యంగా జీవించాలని అభిలషించారు. ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

## హర్యానా, జమ్మూకశ్మీర్‌లో అధికారం కాంగ్రెస్‌దే



**న్యూఢిల్లీ:** హర్యానాలోనూ, జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్ అన్నారు. ఇటు హర్యానా, అటు జమ్మూకశ్మీర్‌లో ప్రధాన అంశాలు, పార్టీ వైఖరిని ఏఎన్ఐకి సోమవారంనాడిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.


**జై జవాన్, జైకిసాన్, జై పహెల్వాన్**

"హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. బీజేపీపై పిడుగుపాటు పడనుంది. హర్యాలోని ప్రధాన అంశం...జై జవాన్, జై కిసాన్, జై పహెల్వాన్. అక్కడ జవాన్లు, రైతులకు అన్యాయం జరిగింది. రెజ్లర్లపై వివక్ష నడుస్తోంది. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ నినాదం ఇదే" అని జైరామ్ రమేష్ తెలిపారు. రైతు రుణాల మాఫీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా కేంద్రం కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ బలంగా చెబుతోందని తెలిపారు. కనీస మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని తాము అడుగుతున్నామని, రైతులు డిమాండ్ చేసున్నది కూడా ఇదేనని అన్నారు. రైతులు తమ డిమాండ్‌తో చేపట్టిన నిరసనల్లో 700 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ మోదీ మాత్రం తన మౌనం వీడలేదని తప్పుపట్టారు. మూడు సాగు చట్టాలను కేంద్ర వెనక్కి తీసుకుందని, అయితే ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం, రైతు రుణాల మాఫీ ఇంకా అలానే ఉన్నాయన్నారు.

**జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ**

జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందనే నమ్మకం తమకుందని జైరామ్ రమేష్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధించాల్సిన అవసరం ఉందన్నారు. పీడీపీతో ఎన్నికల పొత్తు అంశంపై మాట్లాడుతూ, ‘ఇండియా కూటమి’లో పీడీపీ భాగస్వామి అని, అయితే ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుందని చెప్పారు. ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించే వాతావరణం ఉందన్నారు. భారత్ జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌రకు రాష్ట్ర హోదా పునరుద్ధరణే తమ ప్రధాన డిమాండ్ అని, అందుకోసం పోరాడతామని తెలిపారు.

## 125 ఏళ్లు ఆయన బతకాలి, మోదీ అంతకాలం పాలించాలి



**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గద్దె దింపేవరకూ తాను చనిపోనంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై మాటల యుద్ధం జరుగుతోంది. దీనిపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్యానాలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో స్పందించారు. మల్లికార్జున్ ఖర్గే 125 ఏళ్లు బతకాలని, ప్రధాని మోదీ 125 ఏళ్లు ప్రధానిగానే ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని చెప్పారు. మల్లికార్జున్ ఖర్గే జమ్మూకశ్మీర్‌లోని కథువాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వేదికపై స్పృహతప్పి పడిపోతున్న తరుణంలో భద్రతా సిబ్బంది, ఇతర కాంగ్రెస్ నాయకులు ఆయన దగ్గరకు వెళ్లిపట్టుకున్నారు. కొద్దిసేపు ప్రసంగాన్ని నిలిపివేసిన అనంతరం తిరిగి ఖర్గే మాట్లాడుతూ, మోదీని గద్దె దింపేవరకూ తాను చనిపోనంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం తన వయస్సు 83 ఏళ్లని, ఇప్పుడిప్పుడే చనిపోనంటూ వ్యాఖ్యానించారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సోమవారంనాడు తప్పుపట్టారు. ఖర్గే తన వ్యక్తిగత ఆరోగ్య విషయాన్ని మోదీతో ముడిపెట్టి మాట్లాడటం ఏమాత్రం హుందాగా లేదన్నారు. ప్రధాని మోదీ అంటే భయం, ద్వేషం కాంగ్రెస్‌లో గూడు కట్టుకట్టుకుందనడానికి ఇదో ఉదాహరణ అని అన్నారు. ఖర్గే చిరకాలం ఆరోగ్యంగా ఉండాలని తాను, మోదీతో సహా అంతా ప్రార్థిస్తామని, 2047 వికసిత్ భారత్‌ను ఖర్గే చూడాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు.

# మూసీ ప్రాజెక్ట్ పెద్ద స్కామ్

-మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ రాజ్యంలో మీరు ఇండ్లు కట్టిస్తరని ప్రజలు ఓట్లు వేశారు. ఇందిరమ్మ ఇండ్లని మీరే చెప్పారు. కానీ, పేదల ఇండ్లుకూలగొడతమని చెప్పుంటే ఒక్కరంటే ఒక్కరు కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండెనా..? ఒక్కసారి ఆలోచన చేయాలని ముఖ్యమంత్రిని అడుగుతున్నా. ముఖ్యమంత్రి మూడునాలుగు రోజులుగా మీడియాకు మొఖం చాటేశాడు. లేకపోతే మీడియాతో చీట్‌చాట్‌లు చేసేవాడు. ఇప్పుడు చేస్తలేడు. ఎందుకు? భయం. అవతల ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. అధికారులను ముంగట పెడుతున్నరు. అమెరికా వెళ్లి బోగస్ కంపెనీలు తెచ్చిండు వాళ్ల అన్నగాడు. వెయ్యికోట్ల పెట్టుబడి పెట్టే మొగాడు ఎప్పుడైండు.. అన్నిపైసలు యాడికెలి వచ్చినయ్.. రేవంత్ పంపి అక్కడికెలి తెప్పిస్తున్నడా? అని సోషల్ మీడియాలో రాంగనే ఏం చేయాలి.. జయేశ్ రంజన్ రావాలి. రామకృష్ణరావు వచ్చి సంజాయిషీ ఇవ్వాలి. ఇవాళ హైదరాబాద్ మూసీలో ఈ రకంగా దుర్మార్గం ఎలా చేస్తరంటే.. ఓ దాన కిశోర్, ఓ రంగనాథ్ రావాలి. ఎందుకు నీ మంత్రులు ముందటికి రావడం లేదు' అంటూ ప్రశ్నించారు.

### మంత్రులు మూసీపై మాట్లాడరెందుకో..

'మంత్రులు వచ్చి మూసీ గొప్పదనం ఎందుకు చెప్పడం లేదు. మూసీ ఎంత జనరంజక ప్రాజెక్టు.. అద్భుతమైన ప్రాజెక్టో.. రాష్ట్రం ఎంత మురిసిపోతదరి.. ఎన్ని అద్భుతాలు జరుగతయో ఎందుకు చెప్పడం లేదు. చేతకావడం లేదా? లేక సరుకులేదా? వాస్తవాలు చెప్పేధైర్యం లేక.. అధికారుల వెనుక దాక్కుంటే కుదరదు ముఖ్యమంత్రి. అసలు మేనిఫెస్టో చెప్పు. నీ గ్యారంటీ కార్డుల సంగతి చెప్పు. వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. 300రోజులకు కూడా.. ఏం చేయని నీ అశక్తతను చెప్పు. మరి ఎందుకు ఎవడి కోసం ఈ కూల్చివేతలు.. ఎవడి కోసం రూ.1.50లక్షల కోట్లు చెప్పాలి. ఇవాళ ఒక్కొక్క బాధితుడు చెబుతుంటే.. ఏడుస్తుంటే.. చిన్న పిల్లలు ప్లకార్డులు పట్టుకొని బడి బంద్ చేసి రోడ్లెక్కితే ఓ మంత్రి అంటున్నడు. రూ.5వేల కోసమట సోషల్ మీడియాలో మాట్లాడుతున్నారటా.. అందరూ కాంగ్రెసోళ్ల లెక్క ఉండరు. రూ.50కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ అమ్ముకోవడం.. రూ.500 కోట్లకు ముఖ్యమంత్రి పదవి అమ్ముకోవడం.. మంత్రులు పర్సంటేజీలు పంచుకొని ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నం చేయడం.. మీ కాంగ్రెస్ మాదిరిగా దిక్కుమాలిన అలవాట్లు తెలంగాణ బిడ్డలకు అస్సలు ఉండవు' అన్నారు.

### శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై ఆగ్రహం

'ఆత్మగౌరవంపై కొడితే.. ఆత్మగౌరవం విషయానికి వస్తే మంత్రి శ్రీధర్‌బాబు.. తెలంగాణ ప్రజలు తిరగబడితే గ్రామాల్లో తిరగలేని పరిస్థితి వస్తుంది. మీరంటే గౌరవం ఉన్నది. చదువుకున్న వ్యక్తి.. సంస్కారవంతంగా మాట్లాడుతారనే గౌరవం ఉండేది. కానీ, మీ మాటలతో పోతున్నది. మొన్న ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్లాడుతున్నదరు అని అతితెలివి. నిన్ననేమో రూ.5వేల కోసం సోషల్ మీడియాలో ముఖ్యమంత్రిని బూతులు తిడుతున్నరని మాట్లాడతావా? నువ్వుపోయి వాళ్ల ఇంటిపై పడి ఇండ్లు కూలగొడుతామంటే దేవుడచ్చిండని మొక్కుతరా? ఇవాళ అందరూ ఏడుస్తున్నరు. బీపీలు పెరిగి.. షుగర్లు పెరిగి.. ఈఎంఐలు ఎలా కట్టాలి.. మరి మా పరిస్థితి ఏంది? కష్టపడి కట్టుకున్న ఇల్లు కూలగొడుతున్నరని ఆరోగ్యాలు దెబ్బతింటున్నయ్. గర్భిణులు ఏడుస్తుంటే.. చిన్నపిల్లలు గూడు చెదిరి ఏడుస్తుంటే ఆ మాటలు అనడానికి మీకు మనసు ఎలా ఒప్పింది? సంస్కారం ఉన్నోడివి.. చదువుకున్నోడివి గౌరవం ఉండేది. సహవాస దోషం అనుకుంటా.. ఓటుకు నోటు దొంగల పక్కనే కూర్చొని నువ్వు అలాగే అయిపోయినవ్. శ్రీధర్‌బాబు కూడా చెడిపోయిండు. ఇది మంచిది కాదు. ఇప్పటి వరకు ముగ్గురు చనిపోయారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ చనిపోయింది వాస్తవం కాదా? మా నాయకులు హరీశ్‌రావు, సబితక్క, తలసాని గాంధీకి వెళ్తే అడ్డుకున్నది వాస్తవం కాదు. చిన్నపిల్లల ఆవేదన రోజూ కనిపిస్తలేదా? హైకోర్టుకు అర్థమైంది.. నీకు అర్థం కావడం లేదా? ఆయనను తిడుతున్న తిట్లు మాకే మంచిగ అనిపిస్తలేదు. అలాంటి తిట్లు వినలేదు. చూడలేదు. భయం వేస్తుంది. పొరపాటున కాంగ్రెసోళ్లు అటువైపుగా వెళ్లకండి ముందే చెబుతున్న. దానికి మా బాధ్యత కాదు. ప్రజలు విపరీతమైన కోపంలో ఉన్నారు' అంటూ హెచ్చరించారు.

### బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు..

'కాకపోతే ఒకటిమాత్రం పక్కా. ఇవాళ వేలాది కుటుంబాలను రోడ్డునపడేసి.. లక్షలాది నిరాశ్రయులను చేసి.. పేద, మధ్యతరగతి ప్రజలు అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న బిల్డింగ్‌లను కూలగొడుతానంటే మాత్రం బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ఖచ్చితంగా వారికి అండగా నిలబడుతాం. మా నాయకులు వారికి మాట ఇచ్చివచ్చారు. మా ఎమ్మెల్యే సుధీర్ చైతన్యపురిలో చెప్పడం నేను చూశా. బుల్డోజర్ అంటూ వస్తే దానికి అడ్డంగా నేనే నిలబడతా అని చెప్పిండు. తప్పకుండా మేం అందరం చెబుతున్నాం. బుల్డోజర్‌లు వస్తే వాటికి అడ్డుగా బీఆర్ఎస్ పార్టీ నేతలం అందరం నాతో సహా నిల్చుంటాం. అడ్డుకుంటాం అని చెబుతున్నది. ఇది మంచిది కాదు. మీరిది చేయాలనుకుంటే ఓ పద్ధతి ఉంటది. మొదట ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి. ఆరు గ్యారంటీలు అమలు చేయండి. రైతు రుణమాఫీ పూర్తి చేయ్. ఆరు గ్యారంటీలు అమలు చేసి.. అందరి ఖాతాల్లో డబ్బులు వేయ్. ఆ తర్వాత రూ.1.50లక్ష కోట్లు నీ అయ్య జాగీరా? నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెడతా అనడానికి.. ప్రజల సొమ్ము అది. నువ్వు ఉంటవ్ పోతవు రేపు. రూ.1.50లక్షల కోట్లు నీ విలాసాలకు.. కాస్మోటిక్ హంగులకు వెచ్చిస్తావా? పేదప్రజలు చస్తుంటే.. గూడుచెదిరి ఏడుస్తుంటే.. నా ఇష్టం వచ్చిన ప్రాజెక్టు చేస్తానంటే.. ఎవడి కోసం చేస్తావ్.. ఎట్లా చేస్తవ్.. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా? అందుకే ప్రజాకోర్టులోనూ ఎండగడుతాం. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తాం' అన్నారు.

మూసీ ప్రాజెక్ట్ పెద్ద స్కామ్.. ఆరోపించిన కేటీఆర్

మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామీ గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామీ గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ.40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ.40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ.1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి? దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నా'నన్నారు.

### సెక్రటేరియట్‌ని కూలుస్తడేమో..

'మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీసర్. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు నీకాడికెలి మొదలిపెట్టాలి కదా. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. సందు ఇస్తే అది ఎఫ్‌టీఎల్ అని సెక్రటేరియట్‌ని కూలుస్తడేమోనని నాకు డౌట్' అన్నారు.

### రాహుల్.. ప్రియాంక ఎక్కడ?

'మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? ఇది వరకు వచ్చి ఓట్లు అడుక్కునప్పుడు.. అశోక్‌నగర్‌లో చాయ్ తాగుతూ.. షాదాబ్ హోటల్‌లో బిర్యానీ తింటూ యాక్టింగ్‌లు చేస్తూ బ్రహ్మాండమైన నటనా కౌశలాన్ని ప్రదర్శించి ఓట్లు దండుకున్నారు కదా. మరి ఈ రోజు ఆక్రందనలు వినిపించడం లేదా? కాంగ్రెస్ పెద్దలకు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీల్లో ప్రజల ఆక్రందనలు ఇలాగే ఉంటాయ్. నేను ఇంకోమాట అడుగుతున్న. మాట్లాడితే ప్రతి సందర్భంలో మమ్మల్ని అడిగేవారు. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? అని అడిగారు. కాళేశ్వరం కడుతుంటే ఆ నాడు అడిగారు. కాళేశ్వరంతో ఏం సాధిస్తారు.. పెట్టుబడి పెట్టి ఏం చేస్తారని పదేపదే అడిగేది. కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఒక పంటకు 40లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. పరిశ్రమలకు 10శాతం నీళ్లు వస్తాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు వేలాది గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. హైదరాబాద్ నెత్తిమీద శాశ్వతంగా ఒక కుండపెట్టినట్టే కరువు తీర్చే కల్పతురువు కాళేశ్వరం. కాళేశ్వరం కట్టం తర్వాత వరిసాగులో భారతదేశంలో తెలంగాణ టాప్. ఇది కాళేశ్వరం పుణ్యం కాదా? రూ.లక్షకోట్ల పెట్టుబడితో ఏం జరిగిందంటే.. తెలంగాణ వరిసాగులో టాప్‌గా నిలిచింది' అన్నారు.

### మూసిలో ఒక్క రిజర్వాయర్ ఉన్నదా..?

'కాళేశ్వరంతో తాగునీటి సమస్య పోయింది. హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానే రాదు. మరి నేను అడుగుతున్న రేవంత్‌రెడ్డి చెప్పు. రూ.1.50లక్షల కోట్ల మూసీ ప్రాజెక్టుతో మురిసేదెంత మంది ? నీ మూసితో రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ రాష్ట్రానికి ఎంత? మూసీ ప్రాజెక్టుతో ఒక్క ఎకరానికి సాగునీరు వస్తుందా? ఒక రైతుకు లబ్ధి చేకూరుతుందా? ఇప్పటికే మూసీ కింద ఉన్న ఆయకట్టు కాకుండా కొత్తగా ఏమన్న వస్తుందా? మూసీ ప్రాజెక్టులో రిజర్వాయర్ ఉన్నదా? పంప్ హౌస్ ఉన్నదా? అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉన్నదా? ఏం లేకున్నా రూ.1.50లక్షలకోట్లంటే స్కామ్ కాదా? మీరు మాట్లాడితే, మీ రాహుల్ గాంధీ వచ్చి కాళేశ్వరం బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు ఏటీఎం అన్నడు. మూసి ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీకి రిజర్వ్ బ్యాంకా? రూ.1.50లక్షల కోట్లంటే భారతదేశంలోనే అతిపెద్ద కుంభకోణం కాదా? నామామీ గంగేకి రూ.40వేలకోట్లు. సబర్మతి రివర్ ఫ్రంట్ 38.5కిలోమీటర్లు. దానికి మొత్తం ఖర్చు. రూ.7,050కోట్లు. కొద్దిగా పనులు మిగిలి ఉన్నాయట.. ఇంకా నడుస్తున్నయ్. దాని తర్వాత యమున రివర్ ప్రాజెక్ట్ 22 కిలోమీటర్లు. దాని ఖర్చు వెయ్యి కోట్లు. నమామీ గంగేలో ఖర్చు అయ్యింది రూ.20వేలకోట్లు. ఇంకా రూ.20వేలకోట్లు ఖర్చు అవుతుందని వారి అంచనా' అని తెలిపారు.

### థేమ్స్ నదికి కూడా ఖర్చుపెట్టింది రూ.40వేలకోట్లు

'థేమ్స్ నదికి కూడా ఖర్చుపెట్టింది దాదాపు రూ.40వేలకోట్లు. వీటన్నింటికంటే అద్భుతాన్ని ఆవిష్కరిస్తాననంటే.. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? రాష్ట్ర ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఎంత? ఎవరి కోసం మూసీ ప్రాజెక్టు చేపడుతున్నవ్ చెప్పాలి. మురిసెటోళ్లు ఎవరు? ఎగిరిగంతేసేది ఎవరు? నిన్ను ఒత్తిడి చేస్తున్నది ఎవరు? అసలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా పైసలు లేవు అంటవ్. పక్క రాష్ట్రంలో చంద్రబాబు పెన్షన్లు పెంచలేదా? అధికారంలోకి రాంగనే వారంలో పెంచాడు కదా? నువ్వు ఎందుకు రూ.4వేలకు పెంచడం లేదు. దానికి పైసలు లేవు. ఈ రోజు వానాకాలం లాస్ట్ డే. ఇంత వరకు రైతుబంధు దిక్కులేదు. రైతులు అడుగుతున్నరు. నాట్లు వేశామ్.. సీజన్ అయిపోతుందని ఎప్పుడు పైసల్ వస్తయని అడుగుతున్నరు.. దానికి సమాధానం లేదు. రుణమాఫీ కావాలని రైతులు సెల్ఫీల ఉద్యమం చేస్తున్నరు. దానిమీద సమాధానం రాదు. కొత్త హామీలు కాదు.. ఇచ్చిన హామీలు ఏమాయ్యాయంటూ.. పెన్షన్లు ఎగ్గొట్టావంటే చెప్పేటోడు లేదు' కేటీఆర్ మండిపడ్డారు.

## రుణమాఫీ కానివారికి గుడ్‌న్యూస్

-మొదటిపేజీ తరువాయి

ప్రక్రియను వ్యవసాయ అధికారులు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షలకుపైగా రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ రైతులున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

ఆధార్, బ్యాంకు అకౌంట్‌లో పేర్లలో తప్పులను కూడా అధికారులు సరి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష 20 వేలకు పైగా ఆధార్, బ్యాంక్ అకౌంట్ తప్పులను అధికారులు సరిచేశారు. దీంతో త్వరలోనే రేషన్ కార్డు లేని, ఆధార్ తప్పుల కారణంగా ఆగిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయనుంది. ఇప్పటికే అర్హుల జాబితాను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే రైతుల ఖాతాలో డబ్బులు జమకానున్నాయి. ఆధార్ తప్పులు, రేషన్ కార్డులేని దాదాపు 5 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. మొత్తం 5 వేల కోట్లు రైతుల ఖాతాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయనుంది.

మూడు విడతలుగా...

కాగా.. రైతు రుణమాఫీని జూలై 18న ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. మొదటి విడతలో భాగంగా రూ. లక్ష వరకు రుణాలున్న 11 లక్షల 34 వేల మంది రైతుల ఖాతాల్లో రూ. 6 వేల కోట్ల నిధులు జమ చేసింది. జూలై 30న రెండో విడతలో భాగంగా రూ. 1 లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు రుణాలున్న 6 లక్షల 40 వేల మంది రైతుల ఖాతాల్లో రూ. 6 వేల 90 కోట్ల నిధులు జమ చేసింది. రెండు విడతల్లో కలిపి రూ. 12 వేల 224 కోట్లు విడుదల చేసింది. ఆగస్టు 17న ఇక మూడో విడుతలో భాగంగా రూ. 1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు రుణాలున్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. అయితే రూ. 2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు కానట్లు తెలుస్తోంది. కేవలం రూ. 2 లక్షల లోపు ఉన్నవారికే రుణమాఫీ సాయం అందినట్లు సమాచారం.

## దసరా లోపు కొత్త ఉపాధ్యాయులు

-మొదటిపేజీ తరువాయి



పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్య మీద పెట్టేది ఖర్చు కాదని తెలిపారు. పది నెలల్లోనే 11062 టీచర్ల భర్తీకి తాము కృషి చేశామని అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని తెలిపారు.తమ ప్రభుత్వం వచ్చిన అనతికాలంలోనే 30వేల ఉద్యోగ పత్రాలు అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. గురుకులాల గురించి కేసీఆర్ చెప్పారని..కానీ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. తక్కువ సమయంలోని డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని, పరీక్షల నిర్వహణ నుంచి నియామకాల వరకు... 65 రోజుల్లో 11 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పేదలకు కూడా విద్యను అందుబాటులోకి తీసుకురావాలనేది తమ ప్రభుత్వం ధ్యేయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని వెల్లడించారు. త్వరలో గ్రూప్ 1 పరీక్షల ఫలితాలను విడుదల చేస్తామన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే లక్ష్యంలో భాగంగా మొదటి ఏడాదే 60,000 ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు.

11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ పరీక్ష నిర్వహించగా 2.45 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. దరఖాస్తుదారుల్లో 87.61 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు (6,508 పోస్టులు) గరిష్టంగా 88,000 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2,629 మంది స్కూల్ అసిస్టెంట్లు, 727 మంది భాషా పండితులు, 182 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, 220 మంది స్కూల్ అసిస్టెంట్లు, 796 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ నియామకాల కోసం పరీక్ష నిర్వహించారు.

తమ ప్రభుత్వంలో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వంద నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటి గ్రెటెడ్ స్కూల్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఎందుకు చేయలేదని నిలదీశారు. దీని వల్ల టీచర్లలో నిరాశ ఏర్పడిందని చెప్పారు. 36వేల మంది టీచర్ల బదిలీలను ఎలాంటి విమర్శలు లేకుండా తాము పూర్తి చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని.. దాని వల్ల కొంత సమస్యలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

## హైడ్రా అంటే కూల్చివేతలే కాదు..



-మొదటిపేజీ తరువాయి

ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అక్కడి నివాసితులను హైడ్రా తరలించడం లేదని వివరించారు. అక్కడ ఎలాంటి కూల్చివేతలు హైడ్రా చేపట్టడం లేదని, మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని, దీనిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వివరించారు.


హైడ్రా అంటే కూల్చివేతలే కాదని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగు రోడ్డు వరకే అని ఆయన తెలిపారు. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు. హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదని ఏవీ రంగనాథ్ తెలిపారు. అలాగే నివాసం ఉంటే ఆ ఇళ్లను కూల్చదని చెప్పారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కాదని స్పష్టం చేశారు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అక్కి నివాసితులను హైడ్రా తరలించడం లేదని చెప్పారు. అక్కడ ఎలాంటి కూల్చివేతలను హైడ్రా చేపట్టడం లేదని పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని.. దాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని తెలిపారు.

### హైడ్రా లక్ష్యం కూల్చివేతలు కాదు..

కూల్చివేతలు కాదు..చెరువుల పునరుద్దరణ హైడ్రా లక్ష్యమని ఆయన చెప్పారు. పేదలు, మధ్య తరగతి ప్రజల ఇళ్లను హైడ్రా కూల్చివేయదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని రంగనాథ్ అన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకేనని ఆయన స్పష్టం చేశారు. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరుకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలు కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. " కూల్చివేతలన్నీ హైడ్రావి కావు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు గుర్తించాలి. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడడం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు" అనిఆయన వివరించారు.

# నేతలకు నడ్డా ఫుల్ క్లాస్

**హైదరాబాద్ :** పార్టీ శ్రేణులపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదుపై నడ్డా ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు సభ్యత్వ నమోదు 50 లక్షల టార్గెట్ ఇచ్చింది జాతీయ నాయకత్వం. అయితే, 15 రోజుల్లో నేతలు 9 లక్షల సభ్యత్వాన్ని మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన 40 లక్షల టార్గెట్ ని 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు నడ్డా. నేతలంతా రెగ్యులర్ గా ప్రజల మధ్యన ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ హామీలపై పోరాటం చేయాలని నేతలకు సూచించారు నడ్డా.ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు పార్టీకి ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమానం. మీరు క్షేత్రస్థాయికి వెళ్ళండి. శక్తి కేంద్రాల వేదికగా బలోపేతం చేయండి. ప్రజల్లో ఉండండి. పార్టీని శక్తిమంతంగా తయారు చేయండి. మీరెందుకు రెగ్యులర్ గా ప్రజల మధ్య ఉండడం లేదు..? అధికార పార్టీ హామీలపై పోరాటం చేయాలి కదా. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలను, వైఫల్యాలను కూడా ప్రజలకు గుర్తు చేయాలి కదా..? సభ్యత్వ నమోదు కూడా స్పీడ్ గా కావడం లేదు. ఎందుకిలా? 50 లక్షల టార్గెట్ పెట్టుకుని ఇప్పటివరకు 9 లక్షలు మాత్రమే చేస్తారా.?" అని పార్టీ శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేశారు జేపీ నడ్డా.15 రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలని నడ్డా చెప్పారు. ఎంపీలు, పోటీ చేసిన వారు మండలానికి వెళ్లి సభ్యత్వం



కోసం పని చేయాలి. శక్తి కేంద్రం వరకు ఎమ్మెల్యేలు వెళ్లాలి. సభ్యత్వ నమోదు డ్రైవ్ కు మంచి స్పందన వస్తోంది. తెలంగాణలో ఎక్కువ సభ్యత్వం చేయాలని, అధికారంలోకి వచ్చేలా పని చేయాలని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేలా పని చేయాలన్నారు. 15 రోజుల అనంతరం మరోసారి సమావేశం అవుతానని నడ్డా చెప్పారు. కేవలం సభ్యత్వం నమోదు కోసమే నడ్డా ఇక్కడికి వచ్చారు. మూడు ఎమ్మెల్సీ ఎన్నికల సభ్యత్వం కోసం కూడా పని చేయాలన్నారు".బీజేపీ ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు. ప్రధానంగా బీజేపీ సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతంపై ఫోకస్ చేశారు నడ్డా. పార్టీ నేతల నుంచి వివరాలు రాబట్టారు. అదే సమయంలో వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించాలన్న లక్ష్యంతో బీజేపీ ముం దుకెళ్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో 50 లక్షల సభ్యత్వ నమోదు చేయాలనే టార్గెట్ పెట్టుకుంది. నెల రోజుల్లో ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసింది. అయితే, 15 రోజులు అవుతున్నా కేవలం 9 లక్షల సభ్యత్వాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 40 లక్షల చిల్లర సభ్యత్వాలు పూర్తి కాకపోవడంపై నడ్డా కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా పండుగలు వస్తున్న నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం స్పీడ్ అందుకోలేంటూ పార్టీ శ్రేణులు జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లిన పరిస్థితి ఉంది. వచ్చే 15 రోజుల్లో సభ్యత్వ నమోదు డ్రైవ్ ని వేగవంతం చేయాలని, వీలైనంత తొందరగా ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు జేపీ నడ్డా.

# అమ్మాయి పల్లి గ్రామంలోని శ్రమలక్ష్మీ మహిళా సంఘానికి న్యాయం చేయండి





**వాస్తవ నేస్తం,చిన్నంబావి:** వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయి పల్లి గ్రామంలో శ్రమలక్ష్మీ మహిళా సంఘం సభ్యులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ గారిని కలవడం జరిగింది. శ్రమలక్ష్మీ మహిళా సంఘం సభ్యులకు జరిగిన అన్యాయంను జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది. అమ్మాయి పల్లి గ్రామంలోని శ్రమలక్ష్మీ మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ మా శ్రమలక్ష్మీ మహిళా సంఘాన్ని గత 20 సంవత్సరాల నడుపుకోవడం జరుగుతుంది. మా సంఘంలోని సభ్యులు 12 మంది సభ్యులు. అమ్మాయి పల్లి గ్రామ బుక్కీపర్ గారు (వి ఓ ఏ ) గారు మా సంఘంలోని సభ్యులను బుక్ కీపర్ కి అనుకూలంగా ఉన్న వారిని ఒక ముగ్గురిని మా సంఘం సభ్యులకు ఎవరికి తెలియకుండా ఎలాంటి తీర్మానం చేయకుండా అ ముగ్గురిని బయటకు తీసి వారికి తోడుగా కొత్తవారిని ఏడు మంది సభ్యులను తీసుకొని మొత్తము 10 మంది సభ్యులను తయారుచేసి మా సంఘం పేరు మీద పాత సంఘం అని చెప్పి యూనియన్ బ్యాంకు లోన్ ఇప్పించడం జరిగింది. ఆ ముగ్గురి సభ్యులు మాతో పాటు గతంలో ఓవర్సీస్ బ్యాంకు వీపనగాండ్లలో గతంలో లోను తీసుకోవడం జరిగింది. బ్యాంకు లోన్లు తీసుకోవడం జరిగింది. శ్రీ నిధి లోన్లు తీసుకోవడం జరిగింది.బ్ అక్కడ ఓవర్సీస్ బ్యాంకు వీపన గాండ్లలో వారి పేర్లు తొలగించకుండా, వారికి జటప్రోలు యూనియన్ బ్యాంకు లోన్ ఇప్పించడం జరిగింది. మా సంఘం పేరుమీద కొత్తవారికి డాక్యుమెంటు తయారుచేసి బుక్ కీపర్ గారు సీసీ గారు బ్యాంకులో లోన్లు ఇపించడం జరిగింది అని చెప్పడం జరిగింది. మా సంఘం పేరు మీద మాకు తెలియకుండా కొత్త వారికి ఎలా లోన్ ఇప్పిస్తావని మేము కంప్లైంట్ చేయడం జరిగింది. ఎంక్వయిరీ కు వచ్చిన అధికారులు డిపిఎం గారు ఏపీఎం గారు సీసీ గారు మాట్లాడుతూ అలా చేయడం తప్పే కానీ వారిలాగే మీకు కూడా లోన్ ఇప్పిస్తాము మీరు ఈ విషయాన్ని పెద్దగా చేయొద్దని చెప్పడం జరిగింది. సార్ అధికారులు సీసీ గారు, బుక్ కీపర్ గారు ఇలాగా ఎన్ని అవినీతి అక్రమాలు చేస్తారు సార్, అనీ కలెక్టర్ గారికి వివరించడం జరిగింది. మా గ్రామంలోనే కొన్ని సంఘాల దగ్గర బుక్ కీపర్ గారి ఇంటిలో, బ్యాంకు మిత్ర గారు, కొన్ని నెలలు మహిళా సంఘాల బ్యాంకు లోన్లు డబ్బులు నెల నెలా కట్టించుకుని ఆ డబ్బులను బ్యాంకులో జమ కట్టలేదు. ఈ విషయం తెలిసిన తర్వాత గ్రామంలోని కొంతమంది ఏపిఎం గారిని, సిసి గారిని, వివరములు అడగడం జరిగింది. ఈ విషయంలో తప్పు జరిగిందని ఏపిఎం గారు,సిసి గారు, మాట్లాడుతూ బుక్కీపర్ గారు నెలనెల మహిళా సంఘాల ద్వారా డబ్బులు కట్టించిన తర్వాత రసీదులు ఇప్పియ్యాల కానీ ఇప్పియ్యలేదు, మరి బ్యాంకు మిత్ర బ్యాంకులో డబ్బులు జమ చేసిందా లేదా అని చూడాల్సిన బాధ్యత బుక్కీపర్ గారి మీద ఉన్నది కానీ చూడలేదు బుక్కీపుర్ నిర్లక్ష్యం వల్ల ఇలా జరిగిందని ఒప్పుకోవడం జరిగింది. ఈ విషయాలను కలెక్టర్ గారి దృష్టికి తీసుకపోవడం జరిగింది. సార్ మా శ్రమలక్ష్మి సంఘం సభ్యులకు అన్యాయం చేసిన సిసి తిరుపతయ్య గారిపై, బుక్కీ పర్ (విఓఏ) కవితపై చట్టపరమైన చర్యలు తీసుకోగలరని కోరుచున్నాము సార్ అని తెలియజేయడం జరిగింది.

## హైకోర్టును ఆశ్రయించిన మూసీ నిర్వాసితులు..

# ఇళ్ల ముందు వెలసిన కోర్టు స్టే బోర్డులు



**హైదరాబాద్ :** మూసీ పరివాహక ప్రాంత నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. తమ ఇళ్లను కూల్చివేయద్దంటూ ఫణిగిరి నగర్ బాధితులు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. గతంలో ఆక్రమణలకు మార్క్ వేసిన పెయింటింగ్ ను ఇళ్ల యజమానులు తొలగించేస్తున్నారు. తమ ఇళ్లను కూల్చివేయద్దంటూ ఇళ్ల ముందు హైకోర్టు స్టే బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. అటు చైతన్యపురి కొత్తపేటలోనూ మూసీ నిర్వాసితులు వంటా–వార్పు నిర్వహించారు.మూసీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన సర్వేలో ఇంకా గందరగోళం కొనసాగుతోంది. మూసీ రివర్ బెడ్ ఏరియాకు సంబంధించి ఇళ్లకు మార్కింగ్ వేయగా.. వారంతా కోర్టుకెళ్లి స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలలో రెవెన్యూ అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర నిరసన సెగలు ఎదురవుతున్నాయి. మేడ్చల్ జిల్లాకు సంబంధించి ఉప్పల్ తహశీల్దార్ పరిధిలో ఇప్పటికే ఇళ్లకు మార్కింగ్ వేశారు అధికారులు. అయితే తమ ఇళ్లను కూల్చకుండా నిర్వాసితులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. గడిచిన 4 రోజులుగా సర్వే చేస్తున్న అధికారులను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.చైతన్యపురికి సంబంధించి న్యూ మారుతీనగర్, గణేశ్ నగర్, వినాయక్ నగర్, ఫణిగిరి నగర్ కు చెందిన మూసీ నిర్వాసితులు హైకోర్టు బాట పడుతున్నారు. కోర్టు నుంచి స్టే తెచ్చుకుని తమ ఇళ్లను అధికారులు కూల్చకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ఇళ్లను కూల్చకుండా హైకోర్టు నుంచి స్టే తెచ్చుకునేందుకు పిటిషన్లు వేశామంటూ ఫ్లెక్సీలు చాలా చోట్ల వెలిశాయి.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించి సుమారు 45 కిలోమీటర్ల మేర సర్వే కొనసాగుతోంది. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 30శాతం మంది నిర్వాసితులు.. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా? రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించి మూసీ రివర్ బెడ్ ఏరియాలో అనేక మంది శాశ్వత నిర్మాణాల్లో ఉన్నారు, లక్షల రూపాయల విలువ చేసే ప్రాపర్టీ కలిగి ఉన్నారు. దాంతో వారంతా తమ ఇళ్లను ఖాళీ చేసే వెళ్లేందుకు ఒప్పుకోవడం లేదు. మేడ్చల్ జిల్లాకు సంబంధించి ఉప్పల్ తహశీల్దార్ పరిధిలో ఉన్న రివర్ బెడ్ ఏరియాలో నిర్వాసితులను తరలించడం రెవెన్యూ అధికారులకు కొంత తలనొప్పిగా మారింది.బాధితులకు బాసటగా బీఆర్ఎస్ పార్టీ రంగంలోకి దిగింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన బీఆర్ఎస్ నేతలు.. నిర్వాసితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చిన నేపథ్యంలో రేపు సర్వే ఏ విధంగా కొనసాగుతుంది, నిర్వాసితుల తరలింపు ఉంటుందా లేదా అన్నది ఉత్కంఠగా మారింది. మొత్తంగా నాలుగో రోజు కేవలం పునరావాస కేంద్రాలకు బాధితులను తరలింపు వరకే రెవెన్యూ అధికారులు పరిమితమయ్యారు.

## ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో

# ఐటి మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

**మంథని డిగ్రీ కళాశాలలో బిఎఫ్ ఎస్ఐ కోర్సు ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు**



**మంథని :** తెలంగాణ రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్ అండ్ ఇన్సూరెన్స్ (బిఎఫ్ ఎస్ఐ) కోర్స్ ను ప్రవేశ పెట్టినందుకు ఎన్ ఎస్ యు ఐ మంథని నియోజకవర్గ కమిటీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతు మంత్రి శ్రీధర్ బాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి హాజరయ్యారు.కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ కోర్స్ ను విద్యార్థులకు అందిచలన్న మంత్రిగా ఆశయానికి కృతజ్ఞతలు తెలిపారు. మంథని నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ ఎస్ యు ఐ నాయకులు కోరారు. మంథని డిగ్రీ కళాశాలలో బిఎఫ్ ఎస్ఐ కోర్సు ప్రవేశపెట్టడంపై విద్యార్థులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పండుగ, రంగురంగుల పువ్వుల పండగ అయిన బతుకమ్మ పండుగను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ చైర్ పర్సన్ రమా సురేష్ రెడ్డి విద్యార్థినులతో కలిసి బతుకమ్మ లను తీరొక్కపూలతో అందంగా తీర్చిదిద్ది ఆడిపాడారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ మంథని డివిజన్ అధ్యక్షులు కేక్కర్ల సందీప్ గౌడ్ , మండల అధ్యక్షులు జంజర్ల శైలందర్, మున్సిపల్ కౌన్సిలర్స్ గుండా విజయలక్ష్మి పాపారావు, వేముల లక్ష్మి సమ్మయ్య,సీనియర్ నాయకులు మంథని సురేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల రమేష్, నూకల కమల్, సాదుల శ్రీకాంత్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కనిపించనున్న రింగ్ ఆఫ్ ఫైర్



**హైదరాబాద్ :** భూమి, సూర్యుని మధ్య చంద్రుడు వెళ్ళినప్పుడు సూర్య గ్రహణం ఏర్పడుతుంది. ఈ సమయంలో సూర్యుడు పూర్తిగా కానీ పాక్షికంగా కానీ భూమికి కనిపించదు. ఈ ఖగోళ ఘటనను సూర్యగ్రహణం అని అంటారు. ఈ ఏడాది(2024) రెండో సూర్య గ్రహణం ఏర్పడనుంది. ఈ ఏడాదికి ఇదే చివరి సూర్యగ్రహణం కూడా. సూర్యగ్రహణం ఏర్పడినప్పుడల్లా ఆకాశంలో కొన్ని అరుదైన దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. వీటిలో రింగ్ ఆఫ్ ఫైర్ కూడా ఒకటి. ఈసారి కూడా సూర్యగ్రహణం సమయంలో సూర్యుడు చుట్టూ అగ్ని వలయంలా కనిపించానుంది. ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో కూడా కనిపిస్తుందో లేదో తెలుసుకుందాం.సూర్యగ్రహణం గురించి మాట్లాడుతే మొత్తం 3 రకాలు ఉన్నాయి. మొదటి సూర్యగ్రహణాన్ని సంపూర్ణ సూర్య గ్రహణం అంటారు. సంపూర్ణ సూర్యగ్రహణంలో చంద్రుడు భూమిని పూర్తిగా కప్పేస్తాడు. ఈ సమయంలో చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉంటాడు. భూమిపై సూర్యుడి వెలుగు పడకుండా చంద్రుడు కప్పెయ్యండతో పూర్తి అంధకారం కమ్ముకుంటుంది.రెండవ గ్రహణాన్ని పాక్షిక సూర్యగ్రహణం అంటారు. ఇందులో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కవర్ చేయడు. చంద్రుడి నీడ సూర్యుడిలోని కొంత భాగాన్ని కప్పి ఉంచితే సూర్యుడి నీడ పాక్షికంగా భూమిపై పడుతుంది. ఈ పరిస్థితిని పాక్షిక సూర్యగ్రహణం అంటారు.ఈ సమయంలో సూర్యుడి కొంత భాగమే కనిపిస్తుంది. మిగతా భాగం నల్లగా ఉంటుంది.మూడవ సూర్యగ్రహణాన్ని వార్షిక సూర్యగ్రహణం అంటారు. ఇందులో చంద్రుడు సూర్యుడికి, భూమికి మధ్య చాలా దూరంలో వెళతాడు. చంద్రుని స్పష్టమైన వ్యాసం సూర్యుని కంటే తక్కువగా ఉన్నప్పుడు వార్షిక సూర్యగ్రహణం ఏర్పడుతుందివార్షిక సూర్యగ్రహణం సమయంలో చంద్రుని నీడ సూర్యునిపై పడినప్పుడు రింగ్ ఆకారంలో దృశ్యం కనిపిస్తుంది. దీని కాంతి చాలా ప్రకాశవంతంగా ప్రకాశిస్తుంది. సైన్స్ భాషలో దీనిని యాన్యులర్ సొలార్ ఎక్లిప్స్ అని కూడా అంటారు. అయితే ప్రతి గ్రహణంలోనూ ఈ దృశ్యం కనిపించాల్సిన అవసరం లేదు. ఒక్కోసారి ఇలాంటి అరుదైన దృశ్యం ఏడాదికి ఒకసారి కనిపిస్తూ ఉంటుంది. ప్రజలు కూడా ఈ దృశ్యాన్ని ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**రింక్ ఆఫ్ ఫైర్ భారత్‌లో కనిపిస్తుందా?**

సూర్యగ్రహణం అక్టోబర్ 2 రాత్రి 9.13 గంటలకు ప్రారంభమై మర్నాడు అంటే అక్టోబర్ 3 మధ్యాహ్నం 3.17 గంటలకు ముగుస్తుంది. ఈ సూర్యగ్రహణం సంభవించినప్పుడు, భారతదేశంలో రాత్రి సమయం ఉంటుంది. అందువల్ల ఈ సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు. ఖగోళంలో అరుదైన ఘటన రింగ్ ఆఫ్ ఫైర్‌ను భారతీయులు చూడలేరు. ఇది అర్జెంటీనా, పెరూ, దక్షిణ అమెరికా, ఇతర ప్రదేశాలలో కనిపిస్తుంది. సూర్యగ్రహణం రాత్రి పడే సమయం వల్ల భారతదేశంలో సూతకాల కాలం ఉండదు. సూత కాలం అంటే ఏదైనా శుభ కార్యాలు నిషేధించబడిన సమయం. ఈ కాలంలో దేవాలయాల తలుపులు కూడా మూసివేయబడతాయి. అయితే ఈసారి భారతదేశంలో సూర్య గ్రహణం ప్రభావం చూపదు కనుక..సూత కాలం ఉండదు.

## హైదరాబాద్‌లో ముజ్రా పార్టీ

**హైదరాబాద్ :** టాస్క్ ఫోర్స్ పోలీసులు హైదరాబాద్ నగరంలో ముజ్రా పార్టీని భగ్నం చేశారు. మొత్తం 12 మందిని టాస్క్ ఫోర్స్ ఫోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు ట్రాన్స్‌జెండర్ యువతులు, 8 మంది యువకులు ఉన్నారని తెలిపారు. పాతబస్తీ బండ్లగూడలో ముజ్రా పార్టీ జరుగుతుందని సౌత్ జోన్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ టీమ్ కు సమాచారం అందింది. బండ్లగూడ గౌస్‌నగర్‌లోని లేక్‌వ్యూ హిల్స్‌లో ఓ ఫ్లాట్ లో గుట్టు చప్పుడు కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు ప్లాన్ చేశారు నిర్వాహకులు. ముజ్రా పార్టీ నిర్వహించి, అందులో అశ్లీల నృత్యాలు చేపిస్తున్నారు. సాధారణంగా ఇతర రాష్ట్రాల నుంచి యువతలను రప్పించి ఇలాంటివి చేస్తుంటారు. లేకపోతే డబ్బు కోసం ఆశచూపి స్థానిక యువతులను, జిల్లాల నుంచి సిటీకి వచ్చే యువతులతో ఇలాంటివి చేపిస్తారు. కానీ ఇక్కడ జరిగింది వెరైటీ. ట్రాన్స్ జెండర్లతో అసభ్యకరమైన నృత్యాలు వేపిస్తుండగా, యువకులు వారితో కలిసి చిందులు వేస్తూ ఎంజాయ్ చేయసాగారు.పెద్దగా సౌండ్ పెట్టుకుని, తమకు ఇష్టంవచ్చినట్లుగా నిర్వాహకులు ముజ్రా పార్టీకి ప్లాన్ చేశారు. సరిగ్గా అదే సమయంలో టాస్క్ ఫోర్స్ అక్కడికి వెళ్లి అసభ్యకరంగా ఉండి, చిందులు వేస్తున్న వారిని అరెస్ట్ చేసి ముజ్రా పార్టీని భగ్నం చేశారు. నలుగురు ట్రాన్స్ జెండర్లు, ఎనిమిది మంది యువకులను అరెస్ట్ చేసి పీఎస్ కు తరలించారు. ఎప్పటినుంచి ఇది జరుగుతోంది, గతంలోనూ నిర్వహించారా అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. పార్టీలో డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు తీసుకున్నారా అనే కోణంలోనూ విచారణ చేపట్టారు.

## బజ్జీకి అప్పులు ఇవ్వలేదని... వేడి నూనె పోసిన

**మహబూబ్ నగర్ :** ఓ వ్యక్తి తనకు బజ్జీలు అరువు ఇవ్వలేదని ఆ దుకాణం యజమానిపైనే క్రూరంగా ప్రవర్తించాడు. అందరూ చూస్తుండగానే సల సల కాగిన నూనెను అతనిపై పోసేశాడు. ఈ ఘటనలో సదరు షాప్ ఓనర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాలోని కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నెకు చెందిన బొజ్జన్న గౌడ్ స్థానికంగా మిర్చీ బజ్జీల దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వినోద్ అనే వ్యక్తి తనకు బజ్జీలు కావాలని.. డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పాడు. అయితే, అరువు ఇవ్వడం కుదరదని బొజ్జన్నగౌడ్ తేల్చిచెప్పాడు. దీంతో వినోద్ అతనితో అరువు ఎందుకు ఇవ్వవు అని గొడవకు దిగాడు.ఆగ్రహంతో ఊగిపోయిన వినోద్.. పక్కనే కళాయిలో సల సల కాగుతున్న నూనెను బొజ్జన్న గౌడ్‌పై పోశాడు. అయితే, దీన్ని తప్పించుకునే క్రమంలో వీరేశ్ అనే వ్యక్తి వెనకాల బొజ్జన్న దాక్కుండిపోయాడు. దీంతో వీరేశ్ ముఖంపై నూనె పడి పూర్తిగా కాలిపోయింది. వెంటనే స్పందించిన స్థానికులు ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. వీరేశ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో వినోద్ మద్యం తాగి ఉన్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా, బజ్జీల కోసం ఇంత దారుణానికి ఒడిగట్టడంపై స్థానికంగా ఆందోళన నెలకొంది.

## మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

**కమాన్ పూర్ :** మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని చీటీ ఇన్చార్జులు ఏఎస్ఐ మల్లన్న స్నేహలతలు అన్నారు. రామగుండం సి.పి ఆదేశాల మేరకు ధర్మారం లోని కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు షీ టీం ఇంచార్జ్ ఏ ఎస్ ఐ మల్లన్న ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఉమేన్ కానిస్టేబుల్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది సురేష్ తో పాటు వా మేడం విజయలక్ష్మి మరియు ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com